క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



మండల కన్వీనర్, కార్మిక సంఘం అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

బ్రహ్మసముద్రం: ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా పార్టీ బలోపేతం కోసం కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం పాలవెంకటాపురంలో వేపులపర్తి, చెలిమేపల్లి, గోవిందయ్యదొడ్డి, గుండిగానిపల్లికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమై మాట్లాడారు. అనంతరం మండల కన్వీనర్‌తోపాటు కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బోయ సంజీవయ్యను నాయకులు ఘనంగా సత్కరించారు.

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య

బొమ్మనహాళ్: ప్రతి రైతుకూ ప్రభుత్వం ఆధార్ కార్డులాగా 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి సాయికుమార్ తెలిపారు. బుధవారం బొమ్మనహాళ్‌లో జరుగుతున్న 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య కార్యక్రమాన్ని పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు రైతులకు అందాలంటే విశిష్ట గుర్తింపు సంఖ్య ఉన్న కార్డులు తప్పనిసరి అవుతాయన్నారు.

మారెమ్మ జాతరకు విరాళం



విరాళాన్ని అందిస్తున్న మండల కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి

డీ హీరేహాళ్(రాయదుర్గం): డీ.హీరేహాళ్ మండలంలోని మడేనహళ్లిలో ఈ నెల 18న నిర్వహించే మారెమ్మ ఉత్సవాలకు తనవంతుగా మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించారు. బుధవారం ఆ మొత్తాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి, తాలూక బీసీసెల్ అధ్యక్షుడు తొండె వెంకటేష్ .. గ్రామ సర్పంచ్ బొమ్మన్నకు అందజేశారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఉమా

కళ్యాణదుర్గం రూరల్: పాలవాయి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత వెంకటేశులు మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ సీనియర్ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు బుధవారం గ్రామానికి చేరుకుని వెంకటేశులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రేపు గురు సిద్ధావధూత రథోత్సవం

ఉరవకొండ: మండల పరిధిలోని వెలిగొండ గ్రామంలో ఈనెల 14వ తేదీన భగళాముఖి అమ్మవారు, గురుసిద్ధావధూత రథోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 13న గురుసిద్దేశ్వర స్వామి మఠం నుంచి గురులింగప్పస్వామి గ్రామ ప్రజలు భగాళముఖి అమ్మవారి ఆలయానికి వెళ్లి జెండా ప్రతిష్టాపన చేస్తారు. అనంతరం 14న తెల్లవారుజామున గురుసిద్ధావధూత రథోత్సవం నిర్వహిస్తారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న చంద్రశేఖర్ రెడ్డి

కూడేరు: పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యకార్శి చంద్రశేఖర్ రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం మండల పరిధిలోని ముద్దలాపురంలో రైతులు పండించిన బ్యాడిగి మిర్చి దిగుబడిని ఏపీ రైతు సంఘం బృందం పరిశీలించింది. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. అతివృష్టి, అనావృష్టితో ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా.. 10 క్వింటాళ్లలోపే వచ్చిందన్నారు. క్వింటా మిర్చి రూ.50 వేలతో కొనుగోలు చేసి, ఎకరాకు రూ.లక్ష నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి క్రిష్ణమూర్తి, మండల కార్యదర్శి కరీం, రైతు సంఘం మండల నేతలు నారాయణ రెడ్డి, ఈరప్ప, వెంకటేశులు, మల్లికార్జున పాల్గొన్నారు.



ఆంధ్ర- కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో అక్రమార్కులు ఇసుకను దోచేస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసినప్పుడు, పత్రికల్లో వార్తా కథనాలు వచ్చినప్పుడు మాత్రమే పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు నామమాత్రంగా దాడులు చేస్తున్నారు. ఆ తర్వాత ఇసుక దందాను అసలు పట్టించుకోవడం లేదు. దీంతో అక్రమార్కులు దర్జాగా రాష్ట్రం దాటించేస్తూ రూ.లక్షలు నొక్కేస్తున్నారు.

ఆగని ఇసుక దందా !

- వేదావతిని ఊడ్చేస్తున్న ఇసుకాసురులు
- దర్జాగా కర్ణాటక రాష్ట్రానికి తరలింపు
- రూ.లక్షలు గడిస్తున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న అధికారులు

రాయదుర్గం: జిల్లాలోని కర్ణాటక సరిహద్దునున్న రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాలకు అనుసంధానంగా ప్రవహిస్తున్న వేదావతి హగరిలో నాణ్యమైన ఇసుక లభ్యమవుతోంది. కర్ణాటకలో ఈ ప్రాంత ఇసుకకు భలే డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలోనే అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఆయా ప్రాంతాల్లో నిత్యం వందలాది ట్రాక్టర్లలో సరిహద్దు ప్రాంతాలకు ఇసుక తరలిస్తూ డంప్ చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.

ఇసుక తరలింపు ఇలా...

- తాజాగా డీ హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం సమీపంలో భారీగా ఇసుక నిల్వలు పేర్చారు. రోజు ఈ ప్రాంతం నుంచి టిప్పర్ల ద్వారా బళ్లారికి ఇసుక తరలిస్తున్నారు. అలాగే మడేనహళ్లి, లింగమ్మనహళ్లి పరిసరాల్లోని కొండలు కరిగిస్తూ గ్రావెల్‌ను గద్దల్లా తన్నుకుపోతున్నారు. అయితే అక్రమార్కులకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.
- గుమ్మఘట్ట మండలం కేపీకుంట సమీపాన మళ్లీ ఇసుకాసురులు బరితెగించారు. ఎవరు చెప్పినా.. కేసులెన్ని పెట్టినా వినేది లేదన్నట్టు వ్యవహరిస్తున్నారు. అధికారులకు తెలిసినా పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.
- కణేకల్లు మండలం రచ్చుమర్రి, మాత్యం తదితర ప్రాంతాల్లో నిత్యం వందలాది ట్రాక్టర్లు ఇసుక లోడ్‌తో ఉరవకొండ వైపు వెళ్తున్నాయి.
- బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్, బండూరు, కొలగానహళ్లి తదితర ప్రాంతాల నుంచి ఇసుక బళ్లారికి తరలిపోతుంది. పట్టణ పరిసరాల్లోని రాత్రిళ్లు కొండలను కరిగిస్తున్నారు. రాత్రిళ్లు యథేచ్ఛగా ఇళ్లు, లేఔట్లకు మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.
- కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని బ్రహ్మసముద్రం, శెట్టూరు, కంబదూరు, కుందుర్పి మండలాల్లోనూ ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది.
- ఉరవకొండ నియోజకవర్గంలోని బెళుగుప్ప మండలంలో ఇసుక తరలిపోతుంది. పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ప్రకృతి సంపద తరలిపోకుండా అడ్డుకట్టు వేయాలని ఆయా ప్రాంతాల్లోని ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నారు.

సరిహద్దు దాటిస్తే సహించేది లేదు

ఇసుకను అవసరాలకు మాత్రమే ఉచితంగా వినియోగించుకోవాలి. అలా కాకుండా వ్యాపారం చేయాలని చూస్తే ఎంతటి వారైన సరే కఠిన చర్యలు చేపడతాం. ఇందులో రాజీపడే ప్రసక్తే లేదు. అనుమతుల్లేకుండా మట్టి, ఇసుక తరలిస్తే కేసులు నమోదుచేయిస్తాం. ఇప్పటికే సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు అమల్లోకి తీసుకొచ్చాం.

– వసంతబాబు, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

కేసులు నమోదు చేయిస్తాం

అనుమతుల్లేకుండా మట్టి, ఇసుక తరలిస్తే కఠిన చర్యలు చేపడతాం. పట్టుబడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం. సరిహద్దుల్లో నిఘాను మరింత పటిష్టం చేయిస్తాం. బాడుగకు వచ్చే టిప్పర్ యజమానులు ఆలోచించుకోవాలి. పట్టుబడితే కోర్టు ద్వారా రిలీజ్ చేసుకోవాల్సి వస్తోంది.

– రవిబాబు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

నేడు మాజీ మంత్రి శైలజానాథ్ రాక

కళ్యాణదుర్గం: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత డాక్టర్ శైలజానాథ్ గురువారం కళ్యాణదుర్గం రానున్నారు. ఈ మేరకు ఆ పార్టీ పట్టణ కన్వీనర్ ఐ.సుధీర్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్న ఆయన మొట్ట మొదటి సారిగా కళ్యాణదుర్గం పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీ, పార్టీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్యతో ఉదయం 11 గంటలకు మర్యాదపూర్వకంగా భేటీ కానున్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

వివరాలు పక్కాగా సేకరించండి

కణేకల్లు: గర్భిణులు, చిన్నారుల వివరాలను పక్కాగా సేకరించాలని యర్రగుంట పీహెచ్‌సీ డాక్టర్ విజయకుమార్‌నాయక్ ఆశవర్కర్లకు సూచించారు. కణేకల్లులోని ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ (హెల్త్ సెంటర్ల)ను ఆయన బుధవారం సందర్శించారు. డోర్ టూ డోర్ సర్వేపై ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లతో ఆరా తీశారు.

బాలికలకు కరాటేలో శిక్షణ



బాలికలకు కరాటేలో శిక్షణ ఇస్తున్న మాస్టర్లు

రాయదుర్గంటౌన్: బాలికలకు స్వీయరక్షణ నైపుణ్యాలు ఎంతో అవసరమని రాయదుర్గం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఏఎల్ పద్మావతి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సహకారంతో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్నతో రూపొందించిన బాలికల రక్షణ నైపుణ్యాలు, సెల్ఫ్ అవేర్నెస్, ఓవరాల్ డెవలప్‌మెంట్' అనే అంశాలపై జిల్లాలోని వంద విద్యా సంస్థల్లో దాదాపు 50 వేల మంది బాలికలకు అవగాహన అందించేలా కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగానే జూనియర్ కళాశాలలో జెడ్పీ బాలికోన్నత పాఠశాల, బీజీ తిలక్ మున్సిపల్ హైస్కూల్, మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలికలకు అవగాహన కల్పించారు.

నీటిని శుద్ధి చేయడంలో అలసత్వం వద్దు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్ డ్యాం) వద్ద అనంతపురం పట్టణానికి మంచినీటిని సరఫరా చేసే అనంత తాగునీటి ప్రాజెక్ట్‌ను బుధవారం అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్ పరిశీలించారు. ప్రస్తుతం తాగునీటి ప్రాజెక్ట్‌కు రోజుకు ఎన్ని క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారని సంబంధిత అధికారులతో ఆరా తీశారు. వేసవి కాలం ప్రారంభం అవుతుండటంతో మంచినీటి కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రేషన్ దుకాణాల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై అధికారులు దృష్టి సారించి డీలర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున బుధవారం విలేకరులతో మాట్లాడారు. కొందరు రేషన్ డీలర్లు బియ్యంతో పాటు ఇతర సరుకులు పక్కదారి పట్టించడమే కాకుండా, తూకాల్లో కూడా అవినీతికి పాల్పడుతున్నారన్నారు. ఇంటింటికీ రేషన్ ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలన్నారు. సమావేశంలో నాగరాజు, తిమ్మరాజు, మధు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐజీడీ జిల్లా కోఆర్డినేటర్ దుర్గయ్య సూచించారు. బుధవారం పట్టణంలో ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్(న్యూ ఢిల్లీ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బందికి సూక్ష్మ పౌష్టికాహారంపై కళ్యాణదుర్గం, కంబదూరు, కణేకల్లు, కళ్యాణదుర్గం, బొమ్మనహాళ్, మండలాలకు చెందిన అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు.

కనుల పండువగా రథోత్సవం



రాయదుర్గం: భక్తజన సందోహం మధ్య సాగుతున్న లక్ష్మీ నవ నారసింహస్వామి రథోత్సవం

రాయదుర్గంటౌన్: మండల పరిధిలోని మల్లాపురం గ్రామ పరిధిలోని విప్రమలై లక్ష్మీ నవ నారసింహస్వామి బ్రహ్మ రథోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన బుధవారం ఉదయం స్వామి నిత్యకైంకర్యము, రథాంగ హోమం, మడుగుతేరు నిర్వహించారు. అనంతరం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆంధ్రా, సరిహద్దు కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన జన సందోహం నడుమ రథోత్సవం కొనసాగింది.

వేలాదిగా తరలివచ్చిన భక్తులతో గోవింద నామస్మరణ ఆ ప్రాంతం మార్మోగింది. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌పొరాళ్ల శిల్ప, ప్రముఖులు, అధికారులు, అనధికారులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సీఐ జయానాయక్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.



అలంకరణలో లక్ష్మీ నవ నారసింహస్వామి

బాలాంజినేయా నమోస్తుతే !

గుమ్మఘట్ట: మండలంలోని బీటీపీ గ్రామంలో బాలాంజినేయస్వామి రథోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయంలో ఉదయం నుంచే స్వామి వారికి ఆకుపూజ, పుష్పాలంకరణ, పంచామృతాభిషేకం, మహామంగళారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గ్రామంలో ఉన్న చిన్న పెద్దక్క అమ్మవారి ఆలయంలో ఐదురోజులుగా జరిగిన ఉపవాసదీక్ష ముగియడంతో 101 పూర్ణకుంభాలతో స్వాగతం పలికారు. చిన్న పెద్దక్క తల్లి ఆలయంలో లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అలంకరించిన రథోత్సవంలో బాలాంజినేయస్వామి కొలువుదీర్చి ఊరేగించారు.

కమనీయం.. రంగనాథుడి తిరుకల్యాణం

బెళుగుప్ప: మండల పరిధిలోని శ్రీరంగాపురంలో బుధవారం రంగనాథ స్వామి తిరుకల్యాణం ఘనంగా జరిగింది. తొలుత స్వామివారి మూలవిరాట్‌కు తెల్లవారుజాము నుంచే కలశ పూజ, నవగ్రహ, నారాయణ హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి భక్తజన సందోహం నడుమ ఆలయ ప్రధాన అర్చకుడు శంకరశర్మ స్వామి కల్యాణం జరిపించారు. ఉత్సవ విగ్రహాలను భజనలు, మంగళవాయిద్యాల మధ్య వీధుల్లో ఊరేగించారు. శ్రీరంగనాథుడి కల్యాణోత్సవంలో భాగంగా గ్రామంలో బొమ్మలు, గాజుల అంగళ్లు, చిరుతిండి దుకాణాలు వెలిశాయి.



బాలాంజినేయస్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి

పీహెచ్‌సీ సందర్శన



రికార్డులను పరిశీలిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండ రామిరెడ్డి

విడపనకల్లు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండ రామిరెడ్డి బుధవారం సందర్శించారు. ల్యాబ్, రికార్డులను పరిశీలించారు. రోగుల రక్త పరీక్షల చికిత్సల కోసం ఏమైనా మెటీరియల్ కావాలా అని ల్యాబ్ టెక్నీషియన్ నూర్‌బాషాను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాజేంద్రప్రసాద్‌తో కలిసి సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో సీజన్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

శివాలయానికి నీటి వసతి

కంబదూరు: అండేపల్లి సమీపంలో ఉన్న రామప్ప కొండపై ఉన్న శివాలయానికి సర్పంచ్ నీటి వసతి కల్పించారు. కొండకు వచ్చే భక్తులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకూడదని ఉద్దేశంతో సర్పంచ్ పద్మావతమ్మ బోరు వేయించారు. బోరులో నీళ్లు పుష్కలంగా లభించడంతో కొండమీదికి పైపులైన్ ద్వారా నీటి సౌకర్యాన్ని కల్పించారు.

ఇద్దరికి స్వల్ప గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: కాలువపల్లి సమీపంలో బుధవారం రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. వివరాలు.. కుందుర్పి నుంచి అనంతపురం వైపు వెళుతున్న కారు అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వైపు వస్తున్న కారు కాలువపల్లి సమీపంలో ఢీకొన్నాయి. ఘటనలో కార్లలో ప్రయాణిస్తున్న ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. రూరల్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

కణేకల్లు: ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న దుర్ఘటనలో తీవ్రంగా గాయపడి బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని బ్రహ్మసముద్రానికి చెందిన రైతు పెన్నయ్య (52) బుధవారం మృతి చెందారు. ఈనెల 6న ఎరువు బస్తాలను ఆటోలో లోడ్ చేసి డ్రైవర్ పక్కనే కూర్చొని కణేకల్లు నుంచి బ్రహ్మసముద్రానికి వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొన్న విషయం విధితమే. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పార్టీని మరింత బలోపేతం చేయాలి



మాజీ ఎమ్మెల్యే విశ్వను సన్మానించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ(విడపనకల్లు): వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలని విడపనకల్లు మండల నూతన కన్వీనర్‌గా నియమితులైన కురుబ రమేష్‌కు పార్టీ నియోజకవర్గ సమయన్వకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సూచించారు. బుధవారం అనంతపురంలో మాజీ ఎమ్మెల్యే విశ్వను ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి కురుబ రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, యువనేత వై.ప్రణయ్‌రెడ్డిని ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ కురుబ రమేష్ మాట్లాడుతూ.. మండలంలో పార్టీ శ్రేణులను కలుపుకుని పార్టీని బలోపేతం చేస్తామన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, పార్టీ సీనియర్ నాయకులు కరణం భీమిరెడ్డి, హావళిగి భరత్‌రెడ్డి, ఎస్సీ, బీసీసెల్ నాయకులు సుంకన్న, గిరిబాబు, యువరాజు, జనార్ధన్‌రెడ్డి, డిష్ వెంకటేశులు, గడేకల్లు సర్పంచ్ ఉమాశంకర్, ఉలిగన్న, కురువ రామన్నలు, నాయకులు జగదీష్, నారాయణప్ప, పీసీ ప్యాపిలి కిష్టప్ప, కూడేరు ఎంపీపీ నారాయణ రెడ్డి, బైరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మల్లేశ్వరస్వామి గ్రామోత్సవం



అలంకరణలో భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి

ఉరవకొండ: మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం స్వామి మూలవిరాట్‌కు విశేష పూజలు అభిషేకాలు, మహారుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించిన వాహనంలో పురవీధుల్లో మేళతాళాలు, బాణాసంచా పేల్చుతూ ఊరేగించారు. గ్రామోత్సవంలో వందలాది మంది శివమాల భక్తులు తరలివచ్చారు.

ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

కూడేరు: అనారోగ్య సమస్యలుంటే నిర్లక్ష్యం చేయొద్దు. తల్లిదండ్రులకు తెలియజేసి వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ పిల్లలకు సూచించారు. రాష్ట్రీయ బాల ఆరోగ్య సర్వేలో భాగంగా బుధవారం మండల పరిధిలోని కమ్మూరు హైస్కూల్‌ను వైద్యాధికారులు సందర్శించారు. వైద్యాధికారి లక్ష్మీనారాయణ పిల్లలకు స్క్రీనింగ్ టెస్టు చేశారు.